# వడ్యాల్‌ను మండలంగా ఏర్పాటు చేయాలి

**■ మంత్రికి నాయకుల వినతి**

లక్ష్మణచాంద, అక్టోబర్ 8 : వడ్యాల్ గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని ఆదివారం మండల నాయకులు మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని మంత్రి నివాసంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్యాల్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు మరితం సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. మండలంలోని పీచర, రాచాపూర్, పొట్టపెల్లి(కే), వడ్యాల్, వడ్యాల్ తండా, కనకాపూర్, నర్సాపూర్(డబ్ల్యూ), బాబాపూర్, బోరిగాం, కంజర్ గ్రామాలతో కలిపి వడ్యాల్ మండలంగా ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. రైతు బంధు సమితి మండల కన్వీనర్ సాతం గంగారాం, వడ్యాల్ సర్పంచ్ అట్ల లలిత, కనకాపూర్ సర్పంచ్ సుక్కు ముత్తవ్వ, నర్సాపూర్ ఎంపీటీసీ గుజ్జారి గణేశ్, రాచాపూర్ ఎంపీటీసీ రమ, నాయకులు అట్ల రాంరెడ్డి, కోంద్ర నరేశ్ రెడ్డి, మేకల రాజేందర్ యాదవ్, సల్ల రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణచాంద : మంత్రి అల్లోల ఇంద్రకరన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న మండల నాయకులు

**మంత్రిని కలిసిన రైస్‌మిల్ అసోసియేషన్ సభ్యులు**

భైంసా, అక్టోబర్ 8 : నూతనంగా ఏర్పడిన నిర్మల్ జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్ సభ్యులు శనివారం రాత్రి మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యే విఠల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మహేశ్ మాట్లాడుతూ టీఎంఆర్ కింద మరాడించిన బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు అందించే కోటా పెంచాలని కోరారు. ఇందులో రైస్‌మిల్లర్ల యజమానులు రాము, రమణారెడ్డి, మహేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



గృహలక్ష్మి మంజూరు పత్రాలను అందజేస్తున్న గ్రామ సర్పంచ్ కొరిపెల్లి కృష్ణారెడ్డి

# గృహలక్ష్మి మంజూరు పత్రాల అందజేత

లక్ష్మణచాంద, అక్టోబర్ 8 : మండలంలోని తిర్‌పెల్లి గ్రామంలో గృహలక్ష్మి పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు ఆదివారం గ్రామ సర్పంచ్ కొరిపెల్లి కృష్ణారెడ్డి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన 18 మంది మొదటివిడుత గృహలక్ష్మి పథకానికి ఎంపికయ్యారని తెలిపారు. దశల వారీగా ఎంపిక ప్రక్రియ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లింగన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అపూర్వ సమ్మేళనం

ముథోల్, అక్టోబర్ 8 : మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం 1990–91 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సమ్మేళనానికి చదువుకున్న విద్యార్థులు ఒకచోట చేరుకొని ఆనందంగా గడిపారు. తమ ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యార్థి దశ నుంచి కలిసి ఉండి నేడు అందరూ ఒక చోట కలవడం సంతోషకర విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోతన్న యాదవ్, నగేశ్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనంలో కలిసిన 1990- 91 బ్యాచ్ విద్యార్థులు



# డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ

సారంగాపూర్, సెప్టెంబర్ 8 : మండలంలోని సాయినగర్ గ్రామంలోరూ. 10 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆదివారం సర్పంచ్ జాటోత్ నిషాగ జేందర్ భూమిపూజ చేశారు. కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను యువకులకు పంపిణీ చేశారు. అలాగే సారంగాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలికల మూత్రశాలల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఇందులో సర్పంచ్ సుజాతానర్సారెడ్డి, ప్రిన్సిపాల్ మారుతి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాగుల రాంరెడ్డి, మహిపాల్ జగదీశ్, వార్డు సభ్యులు సాబ్లే నెహ్రులాల్, రాథోడ్ జ్యోతిప్రకాశ్, తలాల రాధికా యోగేశ్, జాదవ్ రవీందర్, జాదవ్ రమేశ్, నాయకులు రాథోడ్ ప్రకాశ్‌నాయక్, కారోబార్ జాటోత్ ఝుక్యా, తదితరులు పాల్గొన్నారు.



పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ నిషాగజేందర్

# దేశీదారు పట్టివేత

కుభీర్, అక్టోబర్ 8 : మండలంలోని రంజనీ గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం దాడి చేసి అక్రమ మద్యం (దేశీదారు)ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎండీ షరీఫ్ తెలిపారు. ఇద్దరు నుంచి 96 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. దేశీదారు అమ్మినా, రవాణా చేసినా చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.



కుభీర్ : మద్యం సీసాలతో ఎస్‌ఐ ఎండీ షరీఫ్

**గుడుంబా పట్టివేత**

నర్సాపూర్(జీ), అక్టోబర్ 8 : మండలంలోని బూర్గుపల్లి(జీ)లో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 10 లీటర్ల గుడుంబాను ఆదివారం రాథోడ్ రాము అనే వ్యక్తి నుండి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రవీందర్ తెలిపారు.

# విద్యార్థి ప్రతిభ

భైంసా, అక్టోబర్ 8 : భైంసాలో శిశు మందిర్ కిసాన్‌గల్లీ పాఠశాలకు చెందిన జాదవ్ దీలరాజ్ ప్రతిభ చూపినందుకు ఆదివారం ఆయనను పలువు రు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన దక్షిణ మధ్య క్షేత్ర ఖేల్ కూద్ పోటీలు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ మూడు రాష్ట్రాలకు సంబంధించినవి హైదరాబాద్‌లో జరిగాయన్నారు. లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానం, పరుగు పందెంలో తృతీయ స్థానం జాదవ్ దీలరాజ్ సాధించారని తెలిపారు. విద్యార్థికి పాఠశాల ప్రబంధకారిణి అధ్యక్షుడు డాక్టర్ నగేశ్, ప్రధానాచార్యులు నామాల భోజన్న, ఆచార్యులు అభినందనలు తెలిపారు.

# బుద్ధుడు బోధించిన మార్గాన్ని అనుసరించాలి

భైంసా, అక్టోబర్ 8 : బుద్ధుడు బోధించిన మార్గాన్ని అనుసరించాలని బీఎస్‌ఐ శాఖ అధ్యక్షుడు ప్రసన్నజిత్ ఎంబ్లే పేర్కొన్నారు. ఆదివారం వర్షావాస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా సాహెబ్ అంబేద్కర్, గౌతమ బుద్ధుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రసన్నజిత్ ఎంబ్లే, ఏక్‌నాథ్ బిర్దే, జోందలే, గణేశ్ ఎంబ్లె పాల్గొన్నారు.

# పోలీసు ఉద్యోగం సాధించిన ఇద్దరికి సన్మానం

తానూర్, అక్టోబర్ 8 : మండలంలోని భోసి గ్రామానికి చెందిన గొల్ల గంగాచరణ్, మాధస్తూ లక్ష్మీనారాయణ ఏఆర్ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. గత సంవత్సరం అగ్నిపథ్‌లో ఉద్యోగం సాధించిన గనేవార్ సాయినాథ్, 18 సంవత్సరాల పాటు ఆర్మీలో ఉద్యోగం చేసి విరమణ పొందిన బాయి సాయినాథ్‌ను భోసి కింగ్స్ యూత్ తరపున ఆదివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, సచ్చితనంద్, సాయినాథ్, దత్తాత్రి, శంకర్, రాజరాం, గంగాప్రసాద్, రాజేశ్వర్, సాయినాథ్, విఠల్, సాయిరాం, లక్ష్మణ్, హన్మండ్లు, పండరి తదితరులు పాల్గొన్నారు.

# గొల్లకుర్మల అభ్యున్నతే లక్ష్యంగా..

- గొర్రెల యూనిట్లను అందించిన సర్కారు
- మొదటి విడతలో 190 మందికి..
- రెండో విడుతలో పలువురికి
- ఆనందోత్సాహంలో గొల్లకుర్మలు

దిలావర్‌పూర్, అక్టోబర్ 8 : గొల్లకుర్మల అభ్యున్నతే లక్ష్యంగా సర్కారు ముందుకు సాగుతున్నది. ఆర్థికంగా ఆదుకునేందుకు 75 శాతం సబ్సిడీపై గొర్రెలను అందిస్తున్నది. యూనిట్ ధర రూ.లక్ష 75 వేలు కాగా ఇందులో లబ్ధిదారుడి వాటా కింద రూ.43, 750 చెల్లించాల్సి ఉంటుంది. అర్హులైన లబ్ధిదారులకు యూనిట్లను అందజేస్తున్నది. వారి కుటుంబాల్లో ఆనందం నింపుతున్నది. ఇందులో భాగంగానే మొదటి విడుతలో దిలావర్‌పూర్ మండలంగుండంపల్లి, సముందర్ పల్లి, కాల్వ, బన్సపల్లి, సాంగ్వీ, కంజర్, న్యూలోలం సిర్గాపూర్, దిలావర్‌పూర్ గ్రామాల్లో 190 మందికి ఈ యూనిట్లను సర్కారు అందించింది. రెండో విడుతలో గత నెల రోజుల క్రితం మాయపూర్‌లో 15 మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను అందించారు. ఇందులో ఒక్కొక్క యూనిట్‌కు 20 గొర్రెలు, ఒక గొర్రెపోతు ను అందించారు. గొర్రెలు ప్రమాదవశాత్తు మరణిస్తే లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా ముందుగానే సర్కారు బీమా చేయిస్తున్నది. బీమా చేసిన గొర్రె మరణిస్తే గొర్రెకు రూ. 5 వేలు, గొర్రెపోతుకు రూ.7వేలను సంబంధిత బీమా కంపెనీ ద్వారా నేరుగా లబ్ధిదారుడి ఖాతాలో జమ చేసే సౌకర్యం కల్పించింది.



మాయపూర్ లబ్ధిదారులకు గొర్రెలను అందిస్తున్న ప్రజాప్రతినిధులు (ఫైల్)

**రెండు యూనిట్లు వచ్చినయ్..**



మా తాతల కాలం నుంచి మేము మా వృత్తిని నమ్ముకొని బతుకుతున్నం. ఆ వృత్తి పోనియ్యకుండా ముందుకు వెళ్తున్నాం. మొదటి విడతలో మా అన్నకు నాకు ఇద్దరికి సర్కారు గొర్రెలను అందించింది. వాటిని మంచిగా పెంచి పోషిస్తున్నాం. మందనే మాకు ఆర్థిక భరోసా ఇస్తున్నది. వర్షం పడినా, ఎండకొట్టినా, చలిపెట్టినా వాటిని నమ్ముకొని బతుకుతున్నాం. ప్రభుత్వం అందించిన గొర్రెలు మొదట్లో కొంత ఇబ్బంది పెట్టినా వాటిని సాదుకుంటూ ముందుకు పోయినం. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

**- పవన్ (న్యూలోలం)**

**కులవృత్తులకు సర్కారు చేయూత..**



ఊర్లల్లో అంతరించి పోతున్న కులవృత్తులకు సర్కారు చేయూతనందిస్తున్నది. మా ఊరు చాలా చిన్నది. ఎక్కువ మంది గొల్ల కుర్మలే ఉన్నారు. ఇప్పటి యువకులు ఈ పనులు చేసేందుకు ఇష్టపడడం లేదు. ప్రభుత్వం కులవృత్తులను గ్రామాల్లో ప్రోత్సహించేందుకు ఈ పథకం తీసుకొచ్చింది. నాకు ముందటి నుంచే గొర్రెలున్నాయి. సీఎం కేసీఆర్ గొర్రెలు ఇస్తున్నాడు.. తాత అని మా ఊరిలో పశువుల డాక్టర్ చెప్పిండు. ఆయన చెప్పిన ప్రకారం పైసలు కట్టిన మొన్న నాకు గొర్రెలు వచ్చినయ్. గొర్లతో అన్ని విధాలుగా లాభం ఉంది.

**- ముత్తన్న (మల్లాపూర్)**